క్లుప్తంగా

'ప్రజ్ఞ'లో భగవద్గీత పుస్తకాల పంపిణీ



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

మీర్‌పేట: వికాస తరంగిణి, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని సిల్వర్ డ్రాప్స్ స్కూల్‌లో ప్రజ్ఞ వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం శిక్షణ తరగతులకు పండితులు రాంకిషన్‌రావు, రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. తరగతుల్లో శ్లోకాలు, పద్యాలు, కథలు, ఇంగ్లిష్ గ్రామర్, వేద గణితం, ఆటలు, దేశ సంస్కృతిని పెంపొందించే గేయాలపై పిల్లలకు శిక్షణ ఇస్తున్నట్లు మీర్‌పేట ప్రజ్ఞ కో ఆర్డినేటర్ రఘువీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట వికాస తరంగిణి సభ్యులు రూపవతి, ఉష, ప్రసన్న, సువర్ణ, రవీందర్‌రెడ్డి, రఘువీర్, రమణ, ఉమ, రాధిక, లీల, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చల్లాకు అభినందనల వెల్లువ



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నేతలు

తుక్కుగూడ: రెండోసారి డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సింహారెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గోగికర్ జానకీరామ్, మున్సిపల్ అధ్యక్షుడు జంపన్న యాదవ్, బోగరాజు బాబు, రాజ్‌కుమార్, ఊళ్ల వెంకటేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహా మృత్యుంజయ హోమం



హోమం చేస్తున్న అర్చకులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి లక్ష్మీగణపతి ఆలయంలో గురువారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ పోటీలకు నగర విద్యార్థి



చరణ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఒలింపిక్ పోటీలలో ముఖ్యమైన ఆటగా గుర్తింపు పొందిన 'ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్' జాతీయస్థాయి పోటీలు అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో జరుగుతున్నాయి. ఈ జాతీయ పోటీలకు వివిధ రకాల కేటగిరీలలో జూనియర్ కేటగిరీలో పోటీకి తెలంగాణ రాష్ట్రం తరపున ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహం విద్యార్థి చరణ్‌రెడ్డి ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ మాట్లాడుతూ.. 'ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్'ఆటలలో చరణ్ రెడ్డి చక్కగా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

'ఎంపీని పదవి నుంచి తొలగించాలి'



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎల్లయ్య

ఎల్‌బీనగర్: రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్, శరణ్ సింగ్‌లను వెంటనే ఎంపీ పదవినుంచి తొలగించాలని ఎల్‌బీనగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఇటీవల మహిళా రెజ్లర్లపై జరిగిన లైంగిక దాడులకు నిరసనగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఎస్‌జీఏ కాలనీ రహదారిపై ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ... మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న నేరస్తులకు మోదీ ప్రభుత్వ రక్షణ కేంద్రంగా పనిచేస్తుందని ఆరోపించారు. సీఐటీయూ నాయకులు రమావత్ పాండు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం

డ్రైనేజీలు పూడుకుపోయి మురుగు రోడ్లపైనే పారుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది, దోమలు విజృంభిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు మంజూరు చేసినా అధికారుల సమన్వయం లోపంతో పనులు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- రోడ్లపై పారుతున్న మురుగు
- విజృంభిస్తున్న దోమలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సౌమ్య అపార్ట్‌మెంట్ ఎదుట నిలిచిన మురుగు

హుడాకాంప్లెక్స్: స్వచ్ఛభారత్, స్వచ్ఛ హైదరాబాద్ అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాయి. అయినా సరే కొన్ని ప్రాంతాల్లో అధికారుల అలసత్వం, నివాసదారుల నిర్లక్ష్యంతో స్వచ్ఛతకు తూట్లు పొడుస్తున్నారు. కొన్ని కాలనీలలో నివాసాల మధ్య అడుగు పెట్టలేం. ఓ వైపు వ్యర్థాలు, మరోవైపు మురుగు పారుతుండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా కాలనీవాసులు వ్యాధుల భారిన పడుతున్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధి భగత్‌సింగ్‌నగర్, డాక్టర్స్‌కాలనీ, హుడాకాంప్లెక్స్, సౌమ్య అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో పేదలు నివసించే ప్రాంతాల దుస్థితి ఇది.

నిధులు మంజూరైనా నిరుపయోగం

ఏళ్ల క్రితం వేసిన భూగర్భ డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారి మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతూ రహదారులు మురుగుమయంగా మారుతున్నాయని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రీమోడలింగ్ కోసం జీహెచ్‌ఎంసీ ఏడాదిన్నర క్రితం రూ.84 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు స్థానిక మంత్రి, కార్పొరేటర్‌లు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం, అధికారుల మధ్య సమన్వయలోపంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో సౌమ్య అపార్ట్‌మెంట్ ఎదుట మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతూ.. దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు, మంత్రి సబితారెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. బలహీన వర్గాల కాలనీ బట్టే అధికారులు, ప్రజాప్రతినిధులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. మంత్రి పర్యటించి అధికారులను ఆదేశించినా పనులు మాత్రం కొనసాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు సమస్య పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.



డాక్టర్స్ కాలనీలో మ్యాన్‌హోల్ దుస్థితి

మురుగు సమస్య పరిష్కరించాలి



డాక్టర్స్‌కాలనీలో రోడ్ నెం-2లో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. మ్యాన్‌హోళ్లకు కొత్త కవర్ పెట్టాలని, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు నిధులు మంజూరైనా నేటికీ ప్రారంభించలేదు. పన్నులు సకాలంలో చెల్లించినా ప్రయోజనం లేదు. వర్షాకాలం సమీపిస్తోంది. మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– వి.శ్రీనివాస్‌రావు, డాక్టర్స్ కాలనీ నివాసి

ప్రభుత్వ స్థలంలో నిర్మాణం అడ్డుకోండి

తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మీర్‌పేట: ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం బాలాపూర్ తహసీల్దార్ జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు నర్సింహ మాదిగ మాట్లాడుతూ.. జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ సర్వే నంబరు 119లోని ప్రభుత్వ భూమి పక్కనే ఓ వ్యక్తి 60 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. కొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వ స్థలం అని బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఆక్రమణలకు పాల్పడడం సరికాదన్నారు. వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాన్ని అడ్డుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జనార్దన్ మాదిగ, అంజి మాదిగ, రాజు మాదిగ, రాజేందర్, శంకర్, సురేశ్, కొండల్, మాధవ్, చంద్రశేఖర్ ఉన్నారు.

'ప్రైవేటు' అడ్మిషన్ల జోరు

- గుర్తింపు లేకుండానే చేర్చుకుంటున్న ప్రైవేటు స్కూళ్లు
- ఒక్క పాఠశాల పేరుతో మూడు, నాలుగు పాఠశాలల నిర్వహణ

దిల్‌సుఖ్‌నగర్: వేసవి సెలవులు ప్రారంభం కావడంతో కొత్త విద్యాసంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు జోరందుకున్నాయి. మలక్‌పేట్‌జోన్ పరిధిలో విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్నా అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించలేదు.

- ◆ వివిధ మాధ్యమాల ద్వార రకరకాల ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు తల్లితండ్రులను ఆకర్షించే ప్రయత్నం ముమ్మరం చేస్తున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి జీఓను విడుదల చేయకపోవడంతో ఏ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలి, అనే అయోమయంలో తల్లితండ్రులు ఉన్నారు.
- ◆ మలక్‌పేట్‌జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని ప్రైవేటు కార్పొరేటర్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. కానీ కార్పొరేట్ పాఠశాల పేరుతో రూ.75 వేల నుంచి 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు.
- ◆ సరూర్‌నగర్, బాలాపూర్, సైదాబాద్ మండలాల్లో ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలు సుమారు 60కి పైగానే ఉన్నాయని అధికారులు చెబుతున్నా వారి దృష్టికి రాని పాఠశాలలు మరెన్నో ఉన్నాయి. గుర్తింపు లేని పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుండగా వాటిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలేవి..?

- ◆ నియోజకవర్గాలలో ప్రతి సంవత్సరం కోకొల్లలుగా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలు ఎలాంటి గుర్తింపు లేకుండా దర్జాగా నడిపిస్తున్న వాటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కేవలం ప్రకటనలకే పరిమితమైన విద్యాధికారులు గుర్తింపులేని పాఠశాలలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని పాఠశాలలు గుర్తింపు కోసం దరఖాస్తు చేశామని రసీదు చూపిస్తూ అడ్మిషన్లు ప్రారంభించాయి.
- ◆ దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మలక్‌పేట్ తదితర కార్పొరేటర్ స్కూళ్లకు ఒక్కపాఠశాలకు అనుమతి తీసుకొని మూడు, నాలుగు పాఠశాలలు నడుపుతున్న కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా విద్యాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు



ఈ విద్యాసంవత్సరంలో అనుమతులు లేని, కనీస సౌకర్యాలు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. సరూర్‌నగర్, బాలాపూర్ మండలాలల్లో గుర్తింపు లేని పాఠశాలలకు గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేశాం. ఈవిద్యాసంవత్సరంలో మరోసారి అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు ఇస్తాము. అయినా పాఠశాలలు కొనసాగితే వాటిపై నిబంధనల మేరకు చర్యలుతీసుకుంటాము.

– ఎ. కృష్ణ , ఎంఈఓ

ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కిషన్



నియామకపత్రం అందుకుంటున్న కిషన్

కందుకూరు: మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన మొగిళ్ల కిషన్ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌ముదిరాజ్, ఎంపీటీసీ సభ్యుడు బక్క మల్లేశ్, ఓబీసీ మోర్చా జిల్లా గొర్లకాపర్ల కన్వీనర్ సిద్దాల శ్రీనివాస్, నాయకులు రవీందర్, శ్రీకాంత్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంరెడ్డి

హయత్‌నగర్: కులమతాలకతీతంగా అభివృద్ధి కాంక్షించే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. హయత్‌నగర్ మండల క్రిష్టియన్ అసోసియేషన్ సమావేశం గురువారం హయత్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాంరెడ్డి మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యలను ఎంపీ రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రభుత్వం నుంచి క్రైస్తవులకు అందాల్సిన పథకాలపై పోరాడుతామని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షులు రంగారావు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో క్రైస్తవుల పూర్తి మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందన్నారు. పాస్టర్లు జాన్, విజయ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

న్యూ హరిపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్

దిల్‌సుఖ్‌నగర్: ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని న్యూ హరిపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ న్యూ హరిపురికాలనీలో క్రితిక హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నవీన్‌కుమార్, ఉషారేవతి, జాఫర్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సాయికుమార్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



బీఆర్‌ఎస్ మహేశ్వరం ప్రధాన కార్యదర్శి అరవింద్‌ను కలసిన క్రైస్తవ మత పెద్దలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్కేపురం డివిజన్‌లోని క్రైస్తవ మత పెద్దలు బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ మురుకుంట్ల అరవింద్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవుల బాగోగుల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్, అదేవిధంగా మహేశ్వరం నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న కార్యక్రమాల గురించి కొనియాడారు. మురుకుంట్ల అరవింద్ మాట్లాడుతూ క్రైస్తవులు అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి సబితా ఇంద్రారెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. పాస్టర్లు జాన్, జయరాజ్, కుమార్ మారుతి పాల్గొన్నారు

'టిమ్స్' పూర్తయితే పేదలకు కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: కొత్తపేట మార్కెట్ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రధాన భవనం సెల్లార్ కోసం మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 34 నెలల కాలంలో ఆసుపత్రి నిర్మాణం పూర్తి అవుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిమ్స్ నిర్మాణం పూర్తి అయితే జిల్లాల నుంచి వచ్చే పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు, చైతన్యపురి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ నాయకులు భూపేష్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలలో సౌకర్యాలు కల్పిస్తాం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టి ముంపు సమస్యలేకుండా నివారణ చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఏపీఎస్‌ఈబీ కాలనీ ప్రతినిధులు కాలనీలో డ్రైనేజీ , రోడ్లనిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అండోజు సత్యంచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో మురుగు సమస్య పరిష్కారం కోసం డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని , కాలనీలో ముంపు సమస్య లేకుండా నివారణ చర్యలు చేపడతామని అన్నారు.

పల్లె దవాఖానాలతో ఆరోగ్య భద్రత

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వెల్జాల్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పల్లె దవాఖానాలతో ప్రజలకు ఆరోగ్య భద్రత లభిస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ పేదల ఆరోగ్యానికి అధికప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నారన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లో సర్పంచ్ సంగీత ఆధ్వర్యంలో, జడ్చర్ల అమోఘ్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 659 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. త్వరితగితన పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల అంతారం గ్రామంలో మృతిచెందిన యాదయ్య కుటుంబ సభ్యులకు మంజూరైన బీఆర్‌ఎస్ ప్రమాదబీమా చెక్కు రూ.2లక్షలు విలువైన చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ రాములు, చంద్రయ్య, బోస్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, వైద్యులు వరప్రసాద్, అరుణ్‌కుమార్, కీర్తి, సుమంత్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, జయమ్మ, వెంకటయ్య, చంద్రయ్య, ధరణి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి

సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం స్వర్ణయుగంగా మారిందని.. గతపాలకులు సాధించలేని అభివృద్ధిని తొమ్మిదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఏట రాజు, ఏఈ విద్యాసాగర్, కటారియా, తహసీల్దార్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురం రైతుబజార్ మీదుగా హయత్‌నగర్ వైపు వెళ్తున్న బస్సులు



వనస్థలిపురం గణేశ్ టెంపుల్ వద్ద నిలిచిఉన్న ఆటోలు

శివారు కాలనీలకు బస్సు సౌకర్యం నిల్

వనస్థలిపురం: నగర శివారు ప్రాంతాలలో కొత్త కొత్త కాలనీలు శరవేగంగా రూపుదిద్దుకుంటుండగా ఆయా ప్రాంతాలకు సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టీసీ బస్సులు ప్రధాన రూట్లకే పరిమితం కావడంతో అక్కడి నుంచి కాలనీలకు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక ఆటోలను ఆశ్రయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం నగరానికి వెళ్లేవారు ప్రధాన రహదారుల వరకు వెళ్లడానికి, తిరిగి ఇళ్లకు చేరుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు.

- ◆ నగరం నుంచి వచ్చే బస్సులు విజయవాడ జాతీయ రహదారి పనామా చౌరస్తా నుంచి వనస్థలిపురం గణేష్ టెంపుల్, రైతుబజారుల మీదుగా ఒక్క హయత్‌నగర్ వైపు మాత్రమే వెళుతున్నాయి.
- ◆ నగరం నుంచి వచ్చే చాలా బస్సులు వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీ బస్టాండు వరకు మాత్రమే వచ్చి అక్కడినుంచి తిరిగి వెళుతున్నాయి.
- ◆ విజయవాడ జాతీయ రహదారి పనామా చౌరస్తా నుంచి గానీ, సుష్మ చౌరస్తా నుంచి గానీ, భాగ్యలతా చౌరస్తా నుంచి గానీ సాహెబ్‌నగర్, సామనగర్ తదితర పరిసర కాలనీలకు వెళ్లడానికి ఎలాంటి బస్సు సౌకర్యం లేదు.
- ◆ నాగార్జునసాగర్ రహదారిలో బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా నుంచి సాహెబ్‌నగర్, పరిసర కాలనీలకు వెళ్లడానికి ఎలాంటి బస్సు సౌకర్యం లేదు.
- ◆ బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం తూర్పు కాలనీలు, హయత్‌నగర్‌కు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేదు.
- ◆ బీఎన్‌రెడ్డినగర్ బీడీరెడ్డి గార్డెన్ నుంచి అల్మాస్‌గూడ, మీర్‌పేట, బడంగ్‌పేట తదితర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక ఆటోలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి.
- ◆ సాహెబ్‌నగర్, సామనగర్ తదితర పరిసర కాలనీల ప్రజలు వనస్థలిపురం రైతుబజారు, బ్యాంకులు, ఇతర అవసరాలకోసం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్, నాగార్జునసాగర్ రోడ్డుకు చేరుకోవాలంటే ఆటోలే గత్యంతరం.
- ◆ వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌ల నుంచి శివారు కాలనీలకు వెళ్లడానికి ఆటోలకు రూ. 200 చెల్లించాల్సిన పరిస్థితి. ఇక రాత్రి వేళ ఆటోవాలాలు ఎంత చెపితే అంత ఇవ్వాల్సిందే.

బస్సు సౌకర్యం కల్పించాలి

సాగర్ రోడ్డు బీఎన్‌రెడ్డినగర్ నుంచి, విజయవాడ జాతీయ రహదారి నుంచి వనస్థలిపురం తూర్పు కాలనీలు, సాహెబ్‌నగర్ పరిసర కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలి. శివారు కాలనీలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలకు అధిక చార్జీలు చెల్లించుకోవాల్సివస్తోంది. సరైన రవాణా సౌకర్యం లేక మహిళలు, విద్యార్థినులు, సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఉదయం , సాయంత్రం వేళల్లోనైనా కాలనీలకు బస్సులు నడపాలి.

– విట్టా వెంకటేశ్వర్లు, సామనగర్